
ఆకర్షణీయమైన సెట్టింగ్‌తో హల్దీ ఫంక్షన్ (ఫైల్)

సండే స్పెషల్



కల్యాణ వైభోగమే

ట్రెండు మారిన వివాహ సందడి.. మధురజ్ఞాపకంగా పెళ్లి వేడుకలు

- పల్లకీలో పెళ్లికూతురు.. గుర్రపు స్వారీపై వరుడి ఊరేగింపు
- గుర్తుండిపోయేలా ఏడడుగుల బంధం
- వేడుకల్లో ఎక్కడ చూసినా స్పెషల్ సాంగ్‌లు
- అభిరుచులకనుగుణంగా కార్యక్రమాలు


ఓ వివాహ వేడకలో నిర్వహిస్తున్న పసుపు దంపుళ్లు (ఫైల్)

పెళ్లంటేనే సంప్రదాయ పద్ధతిలో కొనసాగే తంతు. మంగళస్నానాల నుంచి అప్పగింతల వరకు ఆనవాయితీ ప్రకారంగా కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. ప్రస్తుతం వివాహ సందడి ట్రెండ్ మారుతోంది. పెళ్లిని మధురజ్ఞాపకంగా నిలుపుకునేందుకు పాత పద్ధతుల మేళవింపుతో కొత్త రకమైన హంగు ఆర్భాటాలతో వైభోగంగా, పదికాలాలపాటు గుర్తుండిపోయేలా చేసుకుంటున్నారు. ఎంగేజ్‌మెంట్ నాటి నుంచే ఇరు కుటుంబాలు ప్రణాళికల్లో మునిగితేలుతున్నారు. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్‌తో ప్రారంభించి సరికొత్త కార్యక్రమాలతో సందడిగా పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. అమ్మలక్కల పసుపు దంపుళ్లు.. ఒకే రకమైన వస్త్రధారణలో ఆకర్షణీయంగా వేసిన సెట్టింగ్‌లో హుషారెత్తించే పాటలతో చిందేస్తూ హల్దీ ఫంక్షన్.. వధువుతో పాటు వచ్చిన వారందరీ చేతులు ఎర్రగా పండేలా మెహందీ వేడుక.. గుర్రంపై వరుడి ఊరేగింపు.. కల్యాణ వేదిక వద్దకు మహరాణిలా పల్లకీలో వచ్చే పెళ్లికూతురు.. పూలదారిలో గుర్తుండిపోయేలా ఏడడుగులు నడవడం.. అరుంధతీ వీక్షణం.. మిరుమిట్లుగొలిపే విద్యుత్‌కాంతుల మధ్య చిన్నాపెద్ద చిందేసే బరాత్... ఇలా కల్యాణ వైభవాన్ని ఆహాఓహో అనిపించేలా నిర్వహిస్తున్నారు.



7



ఆరోగ్య కేంద్రాల్లో స్పెషాలిటీ వైద్యం

- వారంలో మూడు రోజులు సేవలు
- 11 రకాల వ్యాధులకు వైద్యం
- వచ్చే వారం నుంచి అమలులోకి!

సంగారెడ్డి అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని సర్కారు ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఇక నుంచి స్పెషాలిటీ సేవలు అందనున్నాయి. పేద ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. వచ్చే వారం నుంచి స్పెషలిస్టు డాక్టర్లను ఆరోగ్య కేంద్రాలకు పంపి వైద్య సేవలందించాలని నిర్ణయించింది. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు) ఉన్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) 4, బస్తీ దవాఖానాలు 19 ఉన్నాయి. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు టీవీవీపీ ఆస్పత్రుల్లోని వివిధ రకాల 11 స్పెషాలిటీల్లో నిపుణులైన 115 మంది స్పెషలిస్టు డాక్టర్లు ఇకపై ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సేవలందించేలా వైద్య ఆరోగ్యశాఖ కార్యాచరణ రూపొందించింది.

ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో..

జిల్లాలో ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో 11 రకాల స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్స్ గైనకాలజీ, సైకాలజీ, డెంటిస్ట్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, పల్మనాలజీ స్పెషలిస్టులు సేవలందించనున్నారు. వారంలో మూడు రోజులు స్పెషలిస్టు డాక్టర్లు తమకు నిర్దేశించిన ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సేవలందిస్తారు. మెరుగైన చికిత్స అవసరమైతే సమీపంలోని ఏరియా ఆస్పత్రులతో పాటు

మిగతా 8వ పేజీలో..

ఖాకీ వనంలో

గంజాయి మొక్కలు

- పోలీసుశాఖకు అప్రతిష్ట
- ఉన్నతాధికారుల కళ్లుగప్పి అక్రమాలు
- ఇద్దరు ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లపై వేటు
- జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి రవాణా, విక్రయాలు
- దొరికితేనే చర్యలు.. దొరకనివాళ్లకు సపర్యలు!



గంజాయి స్మగ్లర్లతో దోస్తీ కట్టిన సంగారెడ్డి జిల్లా పోలీసుల బాగోతం రాష్ట్రమంతటా చర్చనీయాంశంగా మారింది. బాధ్యత కలిగిన వృత్తిలో ఉంటూ అక్రమాల్లో భాగస్వాములైన ఇద్దరు ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం సంచలనంగామారింది. క్షేత్రస్థాయిలో ఉన్న అవినీతి బయటపడింది. అసాంఘిక చర్యలను నియంత్రించే ఖాకీ వనంలో గంజాయి మొక్కలు వేళ్లూనుకున్న సంగతి నివ్వెరపోయేలా చేసింది. జిల్లా పోలీసు యంత్రాంగానికి అప్రతిష్ట తీసుకువచ్చింది.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, నవంబరు 2: హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో సంగారెడ్డి జిల్లాలో గంజాయి వినియోగం పెరిగింది. ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్నందున గంజాయి రవాణా మితిమీరింది. గతంలో నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్లలోని మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ప్రస్తుతం గంజాయి సాగు అరుదుగా ఉన్నప్పటికీ రవాణా మాత్రం జోరందుకుంది. దీనిని అడ్డుపెట్టుకొని కొందరు పోలీసులు దండుకోవడానికి అలవాటుపడడంతో ఈ దందా విచ్చలవిడిగా మారింది.

స్మగ్లర్లతో సంబంధాలు!

గంజాయిని అరికట్టాల్సిన పోలీసులే గంజాయి స్మగ్లర్లతో చెట్టాపట్టాల్ వేసుకొని దందాకు సహకరిస్తున్నారే ఆరోపణలున్నాయి. తాజాగా ఓ కేసు విషయంలో పోలీసులు విచారణ జరపగా ఈ వ్యవహారం బయటపడింది. గతంలో మనూరు ఎస్సైగా ఉన్న సమయంలో అంబారియా, మరో ఎస్సై వినయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ మారుతినాయక్, ఏఆర్ కానిస్టేబుల్ మధు స్మగ్లర్లకు సహరించి కాసులు దండుకున్న విషయం తేటతెల్లమైంది. పట్టుకున్న గంజాయిని వదిలేసిన విషయం ఉన్నతాధికారులు విచారణలో గుర్తించారు. ఇప్పటికైతే రెండు కేసుల్లో మాత్రమే వీరి పాత్ర బహిర్గతమైంది. ఇదే కోణంలో మరిన్ని కేసులను తవ్వుతున్నారు. ఖాకీ యూనిఫామ్ ధరించి గంజాయి స్మగ్లర్లతో చేతులు కలపడంపై పోలీసుశాఖ యావత్తు ముక్కున వేలేసుకుంది. స్వయంగా మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ సైతం తమ శాఖ ఇలాంటి వారివల్ల అప్రతిష్ట పాలవుతున్నదని పేర్కొనడం గమనార్హం. ప్రస్తుత జిల్లా ఎస్పీ రూపేశ్ గంజాయి విషయంలో ఉక్కుపాదం మోపుతున్నారు. అయినప్పటికీ ఉన్నతాధికారుల కళ్లుగప్పి కొందరు సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు ఈ గంజాయి రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తూనే

మిగతా 8వ పేజీలో..



రోదిస్తున్న మృతుల కుటుంబ కుటుంబ సభ్యులు, న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

ప్రాణాలు తీసిన వడ్ల కుప్పలు

- ఇద్దరు బిడ్డలతో తల్లిగారింటికి బయలుదేరిన తల్లి
- వారిని బస్టాప్‌లో దిగబెట్టేందుకు వచ్చిన బావ కూడా..
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- పోతారం ప్రమాదం మిగిల్చిన విషాదం

మనోహరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కొత్త ఇంట్లో జరిగే శుభకార్యానికి ఇద్దరు ఆడబిడ్డలను తీసుకుని ఆ తల్లి బయలుదేరింది. వారిని బస్టాప్‌లో దిగబెట్టేందుకు బావ (భర్త పెద్దన్న) ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వెళ్తున్నాడు. అదే వారి చివరి ప్రయాణం అవుతుందని, ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ మృత్యువుగా వారి ప్రాణాలు హరించి వేస్తుందని వారు ఊహించలేదు. రోడ్డుపై కొందరు ఆరబెట్టిన ధాన్యం కుప్పలు ప్రమాదానికి కారణమవుతాయనీ ఎవరూ ఊహించలేదు. కానీ, అనుకోని సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు.. అందులో ఇద్దరు బాలికలు దుర్మరణం చెందారు. శనివారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొన్న ఘటన మిగిల్చిన విషాదం ఇది.

పోతారం గ్రామానికి చెందిన మన్నె ఎల్లయ్య-సాలమ్మలకు నలుగురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆడబిడ్డకు పెళ్లి చేసి అత్తారింటికి పంపారు. నలుగురు అన్నదమ్ములు గ్రామంలో వేర్వేరుగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటారు. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలి పనులకూ వెళ్తారు. ఇందులో చిన్న కుమారుడు కుమార్‌కు భార్య మన్నె లావణ్య(30), మన్నె సహస్ర(9), మన్నె శ్రావ్య(7)లు ఉన్నారు. మన్నె లావణ్య తల్లిదండ్రులు వారి స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా, వర్గల్ మండలం మజీద్‌పల్లిలో కొత్త ఇల్లు కట్టుకున్నారు. గృహ ప్రవేశం సందర్భంగా మన్నె లావణ్య పిల్లలతో బయలుదేరింది. భర్త కుమార్

మిగతా 7వ పేజీలో..

కన్నీటితో సమాధుల పండగ

మెదక్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద చర్చిగా ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐలో సమాధుల పండుగను శనివారం నిర్వహించారు. చర్చి ఆవరణలోని శ్మశానవాటికలోని తమ కుటుంబ సభ్యుల సమాధులను అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతిచేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు, ప్రత్యేక ఏసు గీతాలు ఆలపించారు.


మెదక్ చర్చిలో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

కొర్రీలు పెట్టకుండా వడ్లు కొనాలి : సంగారెడ్డి కలెక్టర్



పటాన్‌చెరు, నవంబరు 2: రైతులను ఇబ్బందిపెట్టకుండా కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరు మండలం బచ్చుగూడెంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలను తూకంవేసి బరువును నిర్ధారించారు. తూకంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా రైతులకు నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, మండల వ్యవసాయాధికారి శివకుమార్ ఉన్నారు.

బచ్చుగూడెంలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి



మంచు కురిసే వేళలో..

చలికాలం ప్రవేశించింది.. పొగమంచు కప్పేస్తోంది. ఉదయం 8 గంటలైనా మంచు దుప్పటిలోంచి సూర్యుడు బయటకు రావడంలేదు. సంగారెడ్డి శివారులో హైవేపై శనివారం ఉదయం ఈ దృశ్యాలు ఆవిష్కృతం అయ్యాయి. చిలప్‌చెడ్, నారాయణఖేడ్‌లోనూ మంచు కప్పేసింది.

- సంగారెడ్డి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్/చిలప్‌చెడ్/నారాయణఖేడ్ (ఆంధ్రజ్యోతి)





కల్యాణ వైభోగమే

ట్రెండు మారిన వివాహ సందడి.. మధురజ్ఞాపకంగా పెళ్లి వేడుకలు



మంగళ స్నానాల సెట్టింగ్



ఎదురు కోళ్లకు గుర్రపు బగ్గీ



ముత్యాల పందిరి..



నవరత్న తలంబ్రాలు

- పల్లకీలో పెళ్లికూతురు.. గుర్రంపై వరుడి ఊరేగింపు
- గుర్తుండిపోయేలా ఏడడుగుల బంధం
- వేడుకల్లో ఎక్కడ చూసినా స్పెషల్ సాంగ్‌లు
- అభిరుచులకనుగుణంగా కార్యక్రమాలు



సండే స్పెషల్



పల్లకీలో పెళ్లి కూతురు..

కొండపాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి అంటే పందిళ్లు, సందళ్లు, తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలే కాదు పల్లకీలు... ఊరేగింపులూ కావాలంటున్నారు నేటి యువత. పల్లకీలో పెళ్లికూతురు రాణిలా ఉంది... మహారాణిలా ఉంది.... అని అంటుంటే సంతోషించని వారు ఎవరుంటారు. ఆడబిడ్డల తల్లిదండ్రులు ఆ మాట వినేందుకు ఎంతో ఉత్సుకత కనబరుస్తారు. అందుకే ఆ ఆనందాన్ని పొందాలని చాలామంది తమ గారాల కూతురిని పల్లకీలో ఊరేగిస్తున్నారు.

15 రోజుల సందడి

పూర్వం 15 రోజులకు పైగా పెళ్లి సందడి ఉండేది. కొంతకాలం తర్వాత రెండు రోజుల్లో వివాహ సందడి ముగించడం పరిపాటిగా మారింది. కానీ ప్రస్తుతం నిశ్చితార్థం నుంచి మొదలై ప్రీ వెడ్డింగ్ షూట్, సంగీత్, మెహందీ ఫంక్షన్, అప్పగింతలు, వివాహ తంతు, రిసిప్షన్ వంటి కార్యక్రమాలతో పూర్వంలాగే 15 రోజులకు పైగా పెళ్లి సందడి కనిపిస్తున్నది.

పెళ్లిళ్ల సందడి షురూ..

ప్రస్తుతం పెళ్లిళ్ల సందడి షురువైంది. రెండు నెలల విరామం తర్వాత వరుస ముహూర్తాలతో వివాహాలకు సిద్ధమవుతున్నారు. జీవితంలో మరువరాని మహత్తర ఘట్టాన్ని జీవితాంతం గుర్తుండిపోయే విధంగా నిర్వహించేందుకు పల్లె, పట్నం అని తేడాలేకుండా ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా వివాహ వేడుకలను నిర్వహిస్తున్నారు.

కారుపోయి పల్లకీ వచ్చే...

గతంలో పల్లకీలు పోయి, వాటి స్థానంలో పూలతో అలంకరించిన ఖరీదైన కార్లు వచ్చాయి. అయితే ఇటీవల కొందరు సంప్రదాయ పద్ధతిని అనుసరిస్తూ పల్లకీల వైపు ఆసక్తిని కనబరుస్తున్నారు. దీంతో మాయమైనవి అనుకున్న పల్లకీలు మళ్లీ మనకళ్ల ముందు కదలాడుతున్నాయి. కేవలం ఊరేగింపు సమయంలోనే కాక పెళ్లి మండపంలోకి వచ్చే సందర్భంలోనూ సరదాగా వధువును పల్లకీలో తీసుకువస్తున్నారు. శోభాయమానంగా రూపుదిద్దుకుని ఉన్న పల్లకీల్లో నూతన దంపతులను అంగరంగ వైభవంగా ఉరేగిస్తున్నాయి. అలాగే పెళ్లి కొడుకులను గుర్రంపై ఉరేగిస్తూ పెళ్లి మండపానికి తీసుకు వస్తున్నారు. మేనా, డోలీ, పల్లకీ ఇలా.. రకరకాల పేర్లతో వివిధ డిజైన్లలో పల్లకీలు అందుబాటులో ఉంటున్నాయి.

సినిమాలకు ధీటుగా ప్రీ వెడ్డింగ్ షూట్....

మర్చిపోలేని రీతిలో.. మధుర జ్ఞాపకంలా యువతీ యువకులు పెళ్లికి సిద్ధమవుతున్నారు. సినిమాలను తలదన్నేలా ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా పెళ్లికి ముందే ప్రీ వెడ్డింగ్ షూట్లు చేసుకుంటున్నారు. సినిమా తరహా మాదిరిగా సినీ, జానపద గీతాలపై కాబోయే జంటలు వీడియో షూట్లో చేసి వాటిని పెళ్లి జరిగే రోజు ఎల్‌ఈడీ స్ర్కీన్‌లతో ప్రదర్శిస్తూ సరదాగా గడుపుతున్నారు. అందుకోసం ప్రత్యేక ఏర్పాటు చేసుకుంటున్నారు.

అభిరుచులకు అనుగుణంగా..



వివాహాల ట్రెండు మారింది. అభిరుచులకు అనుగుణంగ ఏర్పాట్లు చేస్తున్నాం. జీవితకాల మధుర జ్ఞాపకంగా పెళ్లి జరగాలంటే అనేక అంశాలు ముడిపడి ఉంటాయి. ఎంగేజ్‌మెంట్ నుంచి అప్పగింతల వరకు అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

- అన్నమయ్య పవన్, హరిణి, కల్చరల్ ఈవెంట్స్ నిర్వాహకులు

వారమైతే లండన్ తిరిగి వెళ్లేవాడు..

అంతలోనే అనంతలోకాలకు



సాయికిశోర్‌రెడ్డి(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు2(ఆంధ్రజ్యోతి) : విదేశం నుంచి సొంత గ్రామానికి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన వెన్నవరం మహిపాల్‌రెడ్డి, ఇందిర దంపతులకు కుతూరు, ఇద్దరు కుమారులు సంతానం. కూతురు వివాహం జరగగా, ఇద్దరు కుమారులు లండన్‌లో చదువుకుంటున్నారు. కళాశాలకు సెలవులు రావడంతో ఇద్దరు స్వగ్రామానికి వచ్చారు. రెండు రోజుల క్రితం సుచిత్రలో ఉన్న మరో ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం సాయికిశోర్ రెడ్డి(24) బైకుపై వెళ్తుడంగా సుచిత్ర సర్కిల్ సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వారం రోజుల్లో తిరిగి విదేశానికి వెళ్లాల్సి ఉండగా, అంతలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

ఉమ్మడి జిల్లా యోగా ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో స్థానిక టీటీసీ భవన్‌లో శనివారం ఉమ్మడి జిల్లా యోగా సెలక్షన్స్ నిర్వహించారు. అండర్ 14, అండర్ 17 బాల, బాలికల విభాగాలవారీగా మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి సుమారు 150 యోగా క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్య తెలిపారు. ట్రెడిషనల్ యోగా, అర్టిస్టిక్ యోగా, రిథమిక్ యోగా విభాగాల నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వరంగల్ జిల్లాలో అండర్ 17 బాల బాలికల విభాగం, కామారెడ్డి జిల్లాలో అండర్ 14 బాల బాలికల విభాగం రాష్ట్రస్థాయి పోటీలు నవంబరు 8 నుంచి 10వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు.

ప్రాణం తీసిన వడ్ల కుప్పలు

5వ పేజీ తరువాయి..

ఓ పౌల్ట్రీ ఫాంలో పని ఉండటంతో వెళ్లాడు. తన పెద్దన్న ఆంజనేయులును కొంచెం తన భార్యా బిడ్డలను తూప్రాన్- నర్సాపూర్ రోడ్డుపై ఉన్న బస్టాప్ వద్ద దింపమని కోరారు. దీంతో శనివారం తన ద్విచక్ర వాహనంపై మరదలు, ఆమె ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని అంజనేయులు బయలుదేరాడు. వారి వాహనం గ్రామ శివారుకు రాగా, ఎదురుగా అదే గ్రామానికి చెందిన ఒకరి ట్రాక్టర్ గ్రామంలోకి వస్తోంది. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అంజనేయులు, మన్నె లావణ్య, ఆమె ఇద్దరు పిల్లలు సహస్ర, శ్రావ్యలు అక్కడికక్కడే మృతి చెందారు. చనిపోయిన సహస్ర ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి, శ్రావ్య రెండో తరగతి చదువుతున్నారు. ఆంజనేయులుకు భార్య సుజాత, ఒక కుమార్తె భానుప్రియ ఉన్నారు.

రోడ్డుపై ధాన్యం వల్లే ప్రమాదం..

పోతారం గ్రామం నుంచి తూప్రాన్-నర్సాపూర్‌కు వెళ్లే రోడ్డుపై కొందరు స్థానిక రైతులు ధాన్యం ఆరబెట్టారు. దీంతో వాహనాలు ఒక వైపు నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వేగంగా వచ్చి నలుగురు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. నలుగురు వాహనంపై నుంచి కిందపడి చెల్లాచెదురుగా పడి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే గ్రామం నుంచి బంధువులు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాలపై పడి రోధించారు. 'సంతోషంగా తల్లిగారింటికి బయలుదేరి.. పిల్లలతో సహా కనిపించకుండా పోయావా' అంటూ రోదించారు. దిగబెట్టి వస్తానని వెళ్లిన వ్యక్తి అనంతలోకాలకు వెళ్లాడని ఆంజనేయులు మృతదేహాన్ని చూసి అక్కడి వారు కన్నీరుమున్నీరయ్యారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకట్‌రెడ్డి సందర్శించారు. తమకు న్యాయం చేయాలని మృతుల బంధువులు ఘటనా స్థలంలో ఆందోళన చేశారు.

'ఉపాధి హామీ'లో లోపాలు

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం



కోహీర్‌లో ఉపాధి పనులపై నిర్వహిస్తున్న ప్రజావేదిక

కోహీర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో రూ.5.58 కోట్లతో చేపట్టిన పనుల్లో చోటుచేసుకున్న పొరపాట్లను చదివి వినిపించారు. ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది తనిఖీ బృందానికి పంచాయతీరాజ్ పనులకు సంబంధించిన రికార్డులు చూపించలేదని వారు సభా దృష్టికి తీసుకువచ్చారు. పీచేర్యగడి తండా, పర్శపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనుల రికార్డులను అప్‌డేట్ చేయలేదని, గురుజువాడలో పంచాయతీ కార్యదర్శి సంతకాలు లేకుండా బిల్లులు చేసినట్లు గుర్తించారు. పలు గ్రామ పంచాయితీల వద్ద పే స్లిప్స్ అందుబాటులో ఉంచడం లేదని, పూర్తి స్థాయిలో కూలి డబ్బులు కూడా చెల్లించడంలేదని తేల్చారు. ఎంపీడీవో, ఏపీవోలు పర్యవేక్షణ కొరవడడంతో ఒకరికి బదులు మరొకరు పనులు చేసినట్లు చెప్పారు. ఖానాపూర్ గ్రామంలో పూర్తి స్థాయిలో మొక్కలు పెంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, ఏపీడీ బాల్‌రాజ్, ఎంపీడీవో భారతి, అధికారులు పద్మావతి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన రేవంత్ సర్కార్

● ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులను రేవంత్ సర్కార్ విస్మరించిందని, ప్రతిపక్షాలను తిట్టడంలో ఉన్న శ్రద్ధ రైతులపై ముఖ్యమంత్రికి లేదని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం అందుబాటులోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా తూకం వేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారన్నారు. వ్యవసాయరంగానికి పెద్దపీట వేయకుండా హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో కాలయాపన చేయడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ.లక్ష కోట్లు దాటలేదు.. కానీ మూసీ సుందరీకరణకు రూ.లక్షా యాభై వేల కోట్లు వెచ్చించడమేమిటో అని విస్మయం వ్యక్తం చేవారు. రైతు భరోసా అమలుచేస్తూ, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. రైతులను నిర్లక్ష్యం చేస్తే వారి పక్షాన అందోళనలు చేస్తామని హెచ్చరించారు.



సిద్దిపేట కల్చరల్‌లో నియామక పత్రాలతో ఎంపికైన అభ్యర్థులు

స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు కౌన్సెలింగ్

● 25 మందికి పాఠశాలల కేటాయింపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో శనివారం నియామక కౌన్సెలింగ్ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి జిల్లాలోని 25 పాఠశాలకు పోస్టింగులు ఇచ్చారు. ఇందులో 24 జడ్పీ పాఠశాలలుండగా, ఒకటి ప్రభుత్వ యాజమాన్య పాఠశాల ఉన్నది. వారు నేడు సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఏడీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, సీఎంవో వెంకటేశం, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, నాగభూషణం, రఘు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో 27 మందికి...

సిద్దిపేట కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : స్కూలు అసిస్టెంట్, ఎస్జీటీ(స్పెషల్ ఎడ్యుకేషన్) అభ్యర్థులకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏడుగురు స్కూలు అసిస్టెంట్లు, 20 ఎస్‌జీటీలకు నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 35 పోస్టులకు 27 పోస్టులు భర్తీ చేయగా.. మరో స్కూలు అసిస్టెంట్, 7 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తదుపరి ఉత్తర్వుల ప్రకారం ఖాళీల భర్తీ ఉంటుందన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ రంగనాథ్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే కాలనీలో పది మద్యం బెల్టుషాపులు

● డీఎస్పీ, ఎక్సైజ్ సీఐకి కాలనీ వాసుల ఫిర్యాదు



డీఎస్పీ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న శ్రీవాణీనగర్ కాలనీ వాసులు

పటాన్‌చెరు, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవాణినగర్ కాలనీ మద్యం బెల్ట్‌షాపులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పది బెల్ట్‌షాపులు నడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు శనివారం కాలనీవాసులు ఏకమై పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరు సర్కిల్ ఎక్సైజ్ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. బెల్టు షాపులతో కూలీనాలీ చేసుకునే నిరుపేదలు, యువత మద్యానికి బానిసై రోడ్లపై నిత్యం హంగామా సృష్టిస్తూ మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రవీందర్‌రెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్త, వెంకన్న, వల్లభ, సురేష్, కృష్ణ, రమణ, తిరులేష్, నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.

డీసీసీబీ చైర్మన్ కారు ఢీకొని

మహిళ మృతి.. ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు




ప్రమాదానికి గురైన కారు

గజ్వేల్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ కారు... మరో కారును ఢీకొట్టగా మహిళ మృతి చెందింది. గజ్వేల్ సీఐ సైదా కథనం ప్రకారం సికింద్రాబాద్‌కి చెందిన మహ్మద్‌రజా తన కుటుంబ సభ్యులు మహ్మద్‌జమీల, ఖజిమ్, సకీనాలుతో కలిసి కారులో జనగామ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో గజ్వేల్ మండలం రిమ్మనగూడ శివారులో ఓ హోటల్ వద్ద భోజనం చేసి రోడ్డు దాటుతుండగా వారి కారును మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన నలుగురిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మహ్మద్ జమీల అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగతా ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శివనామస్మరణను అలవర్చుకోవాలి

● రాంపూర్ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి



స్వామివారికి అభిషేకం చేస్తున్న మాధవానంద సరస్వతి

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు శివనామస్మరణను అలవర్చుకోవాలని రాంపూర్ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి అన్నారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లోని శ్రీ పార్థివేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైవనామ చింతనతో మానసిక ఆనందం లభిస్తుందన్నారు. అలాగే శ్రీవీరాంజనేయ స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ పూజారి బెజుగామ విఠల్‌శర్మ, దేశపతి రాజశేఖర్‌శర్మ ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు అర్చిత



అర్చిత

మెదక్ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్టస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో మెదక్ జిల్లా చందంపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని అర్చిత ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో స్టోరీ టెల్లింగ్‌లో విభాగంలో అర్చిత ప్రతిభ కనబర్చింది. మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. అదే విధంగా డాన్స్‌లో ఐశ్వర్య గ్రూప్, వాయిద్యాల పోటీల్లో అఖిల్‌కు ప్రోత్సాహక బహుమతులతోపాటు జ్ఞాపిక, నగదును విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రాజీవ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆ విద్యార్థులను కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈవో రాధాకిషన్, ఏఎంవో సుదర్శనమూర్తి, ఎంఈవో పుష్పవేణి, కమిటీ సభ్యులు అంజాగౌడ్, మాధవరెడ్డి, వంశీకృష్ణ, గైడ్ టీచర్లు మాధవి, ప్రభు, రహీం అభినందించారు.



కాజీపల్లిలో అధునాతన హంగులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనం

ప్రభుత్వ బడికి కార్పొరేట్ హంగులు

- పరిశ్రమ సహకారంతో అధునాతన భవనం
- రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మాణాలు
- ప్రైమరీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు
- వచ్చే నెలలో అందుబాటులోకి..

జిన్నారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లిలో అధునాతన హంగులతో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణం పూర్తి కావస్తోంది. కెంటెక్ పరిశ్రమ రూ2 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో చేపట్టిన పాఠశాల భవనం ఆధునిక హంగులతో నిర్మాణం జరుపుకోగా నవంబరులో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అధునాతన వసతులు..

మండలంలోని పారిశ్రామిక పంచాయతీ కాజీపల్లిలో ప్రాథమిక పాఠశాలను ఆధునిక వసతులతో నిర్మించారు. గతంలో ఉన్న పాఠశాల భవనాల స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టారు. ఏడాది కాలంగా జరుగుతున్న పనులు చివరి దశకు చేరుకోగా నవంబర్ 14 బాలల దినోత్సవం రోజున ప్రారంభోత్సవానికి కసరత్తు చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఇక్కడే నిర్మించారు. విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ అవసరాలు దృష్టిలో ఉంచుకుని విశాలమైన తరగతి గదులు, ఫ్లోరింగ్, వాష్‌రూంలు, గాలి, వెలుతురు వచ్చేలా భవనం నిర్మించారు. గదుల్లో పూర్తి స్థాయిలో ఫర్నీచర్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

డిజిటల్ తరగతుల నిర్వాహణకు ఏర్పాట్లు..

నూతన పాఠశాల భవనంలో డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ సత్యనారయణ తెలిపారు. స్థానిక పరిశ్రమల సీఎస్‌ఆర్ నిధులతో గ్రామంలో విద్య, వైద్యం, మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని సామాజిక బాధ్యతతో ఇతర పరిశ్రమలు కూడా సహకారం అందించాలని కోరారు.



పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం

కుల గణన సర్వేలో లింగాయత్‌లు నమోదు చేయించుకోవాలి: ఎంపీ

నారాయణఖేడ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో లింగాయత్‌లు, లింగబలిజలు ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన లింగాయత్, లింగబలిజ రాష్ట్ర సమావేశంలో పాల్గొని ఈ సర్వేలో లింగాయత్‌లు, లింగబలిజలు కుల గణన సర్వేలో తమ కులాన్ని లింగాయత్, లింగబలిజగా నమోదు చేయించుకోవాలని తెలిపారు.

టీటీడీ నూతన చైర్మన్‌కు సన్మానం

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవ స్థానం నూతన చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

జిన్నారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్టుకు బొల్లారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. బొల్లారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని నిషా కుమారి రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-17 బాలికల కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మంగీలాల్ తెలిపారు. ఈ సందర్భంగా రూ.3వేల నగదు పరితోషకాన్ని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అందజేసి, అభినందించారు.

● హవేళిఘణపూర్, నవంబరు2, (ఆంధ్రజ్యోతి); హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు కార్తీక్ గౌడ్, శరత్‌కుమార్‌లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన వారిని ప్రిన్సిపాల్ సృజన, ఉపాధ్యాయబృందం శనివారం సత్కరించి అభినందించారు.

తండ్రికి కూతురు తల కొరివి



తల కొరివి పెడుతున్న రమ్య

చిన్నశంకరంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన ధ్యానబోయిన దశరథం అనారోగ్యంతో మృతి చెందారు. దశరథంకు భార్య విజయ, ఇద్దరు కుమార్తెలు శిరీష, రమ్య ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో చిన్న కూతురు రమ్య శనివారం తల కొరివి పెట్టింది.

తూప్రాన్‌లో సీపీఎం(ఐ) జిల్లా మహాసభ

తూప్రాన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): శ్రీలంక దేశ అధ్యక్షుడు కమ్యూనిస్టు పార్టీ నాయకులే అని సీపీఎం(ఐ) రాష్ట్ర కార్యదర్శి చుక్కా రాములు అన్నారు. తూప్రాన్‌లో శనివారం సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం(ఐ) పార్టీ 15వ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తూప్రాన్ లింగారెడ్డి ఫంక్షన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. శ్రీలంక ప్రజలు ఎర్ర జెండా ప్రాధాన్యత తెలుసుకున్నారన్నారు. సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున్, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సంగారెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

'మూఢనమ్మకాలను వీడాలి

నర్సాపూర్,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడాలని సైంటిఫిక్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు.

దాహార్తి తీరేదెన్నడో?

● బొల్లారం మున్సిపాలిటీలో మూడేళ్లుగా సాగుతున్న మిషన్ భగీరథ పనులు
● గత ప్రభుత్వంలో రూ. 28.69 కోట్లు మంజూరు
● 90 శాతం పనులు పూర్తి
● పారిశ్రామికవాడలో నీటి కోసం నిరీక్షణ



మోడల్ పాఠశాల వద్ద ఏడాది క్రితమే పూర్తయిన 20 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంప్, పంప్‌హౌస్

జిన్నారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతం బొల్లారంలో మున్సిపాలిటీలో చేపట్టిన మిషన్ భగీరథ పనులు సుమారు మూడేళ్లుగా సాగుతుండడంతో నీటి కోసం స్థానికులకు ఎదురుచూపులు తప్పడంలేదు. దశబ్దాలుగా ఈ ప్రాంతంలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ కింద నిధులు మంజూరు చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోపల ఉన్న ప్రాంతం కావడంతో (హెచ్ఎండబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. అయితే మూడేళ్లగా జరుగుతున్న పనులు నేటికీ పూర్తికాకపోవడంతో నీటి సరఫరా ఎప్పుడో తెలియని పరిస్థితి నెలకొన్నది.

నిధుల మంజూరుతో సాగుతున్న పనులు

జిన్నారం మండలం నగర శివారు ప్రాంతం అయిన బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో దీర్ఘకాలంగా నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.28.69 కోట్లు మంజూరు. చేసింది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణ చేపట్టారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని కొత్త బస్‌స్టాండ్ వద్ద 25 లక్షల లీటర్ల కెపాసిటీ గల భారీ వాటర్ ట్యాంక్, ఔటర్ రహదారి మోడల్ పాఠశాల వెనకాల 20 లక్షల లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్. ఒక పంప్‌హౌజ్‌ల నిర్మాణ పనులు ఏడాది క్రితమే పూర్తి అయ్యాయి. ఇక పట్టణంలో 20 కాలనీలలో సుమారు 55 కి.మీల మేర కొత్త పైప్‌లైన్ వేయగా కొత్తగా 3,000 వేల నివాసాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. మరో 2 వేల వరకు గృహాలకు నల్లా కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉన్నది.

పనుల పూర్తికి తప్పని నిరీక్షణ

మూడు దశాబ్దాలుగా బొల్లారంలో ప్రధాన సమస్యగా మారిన నీటి సరఫరాకు మిషన్ భగీరథ పనులతో శాశ్వత పరిష్కారం దక్కనున్నది. స్థానిక పరిశ్రమల కాలుష్యం, అడుగంటిన భూగర్భ జలాలు, 60 వేల జనాభాకు 15 రోజులకు ఓసారి వచ్చే నీరు. నిత్యం తాగు నీటి కోసం స్థానికులు ట్యాంకర్లు, ఆర్‌వో ప్లాంట్ల పై ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ పథకం కింద చేపట్టిన పనులు పూర్తయితే పారిశ్రామిక మున్సిపాలిటీ బొల్లారంలో నెలకొన్న ప్రధాన సమస్య తీరనున్నది. ఇక పైప్‌లైన్‌ల కోసం చాలా కాలనీల్లో తీసిన గుంతలతో స్థానికులు ప్రమాదాలు, ఇక్కట్ల బారిన పడగా ఇటీవలే ఆయా రహదారులపై సీసీ రోడ్ల పనులు చేపట్టారు. పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో స్థానికులు నిరంతర నీటి సరఫరా కోసం నిరీక్షిస్తున్నారు. మరో మూడు నెలల్లో మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియనుండగా ప్రజలకు నీటి సరఫరా తమ హయాంలో ప్రారంభం అవుతుందో లేదోననే అనుమానాలు పాలకవర్గంలో నెలకొన్నాయి.



కొత్తబస్ స్టాండ్ వద్ద 25 లక్షల లీటర్ల సామర్థ్యంతో పనులు పూర్తయిన వాటర్ ట్యాంక్

నెలలో పూర్తి చేస్తాం

బొల్లారంలో చేపట్టిన మిషన్ భగీరథ పనులు 90శాతం వరకు పూర్తి అయ్యాయి. రెండేళ్లలో 55 కి.మీల పైప్‌లైన్లు, కొత్తగా 3,000 నల్లా కనెక్షన్లు ఇవ్వగా, మరో 2 వేల కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కాగా మున్సిపాలిటీకి నిత్యం సరఫరా చేసే నీటిశాతంపై స్పష్టత రావాల్సి ఉంది. మరో నెల రోజుల్లో అన్ని పనులు పూర్తి చేసి నీటి సరఫరా చేపట్టాలనే ఉద్ధేశంతో పనులు చేస్తున్నాం.

శ్రీనివాస్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ,
మిషన్ భగీరథ ఏఈ

అందరికీ సామాజిక న్యాయం కోసమే కులగణన



సంగారెడ్డిలోని అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అందరికీ సామాజిక న్యాయం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ కులగణన చేపట్టిందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్‌భవన్‌లో కులగణనపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణనను పక్కా ప్రణాళికతో నిర్వహించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలం మధు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్, మాజీ ఎంపీపీ అంజనేయులు, రాంచంద్రాపూర్ కార్పొరేటర్ పుష్పానగేష్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

సంగారెడ్డి రూరల్/కంది, నవంబరు (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామంతో పాటు కంది మండలం చిదురుప్ప గ్రామంలో శనివారం వరి కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. కాగా కంది మండలకేంద్రంలో పీఏసీఎస్ ఛైర్మన్ దొడ్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని డీసీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్ముకొని మోసపోవద్దని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంచందర్‌నాయక్, మాజీ ఎంపిపి అంజనేయులు, తాళ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఎంకని ప్రవీణ్, కులబ్‌గూర్ మాజీ ఉప సర్పంచ్ ఆశం, నాయకులు చేర్యాల ఆంజనేయులు, మోతీలాల్, కోడూరు శ్రీశైలం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంచెందర్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రాచన్నస్వామి ఆలయంలో జిల్లా జడ్జి పూజలు



రాచన్న సన్నిధిలో జిల్లా జడ్జి పూజలు

కోహీర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడంపేట గ్రామంలో గల శ్రీ రాచన్నస్వామి ఆలయంలో శనివారం జిల్లా ప్రిన్సిపాల్ సెషన్స్ జడ్జి భవానీచంద్ర ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్తీకమాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయానికి వచ్చిన జడ్జికి ఆలయ ఈవో శివ రుద్రప్ప ఆధ్వర్యంలో ఆలయ అర్చక బృందం జడ్జి భవానిచంద్రకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జడ్జి స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శివ రుద్రప్ప, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో క్రమశిక్షణ ముఖ్యం

మెదక్ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో క్రమశిక్షణ, సమయపాలన చాలా ముఖ్యమని, హోంగార్డు ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో హోంగార్డుల సమస్యలు తెలుసుకునేందుకు ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, హోంగార్డు ఇన్‌చార్జి శ్రావణ్, హోంగార్డు జిల్లా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం మెదక్ రూరల్ పోలీసు స్టేషన్‌తోపాటు సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



పుల్కల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్

పుల్‌కల్/జోగిపేట/వట్‌పల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని చౌటకూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్ పేర్కొన్నారు. చౌటకూర్ మండలంలోని వెండికోలు, పోసానిపల్లి, బొమ్మారెడ్డిగూడెం, ఉప్పరిగూడెం, శేరిరాంరెడ్డిగూడెం-బద్రిగూడెం, తాడ్దానిపల్లి గ్రామాలలో ఐకేపీ, డీసీఎంఎస్‌ల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం నత్తి దశరత్ ప్రారంభించారు. కార్యక్రమంలో జోగిపేట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొల్ల రాములు, నాయకులు చక్రియాల మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అందోలు మండలంలోని అన్నాసాగర్, రోళ్లపహాడ్, మన్‌సాన్‌పల్లి, రాంసాన్‌పల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను శనివారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం మాణిక్యం, రైతులు పాల్గొన్నారు. వట్‌పల్లి మండలం కేరుర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు కార్తీక్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సీసీమల్లేశం, సెంటర్ ఇన్‌చార్జి నరసింహులు తదితరులు ఉన్నారు.

త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి: పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హడావిడిగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం కాదు.. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అకాల వర్షాల నుంచి రైతులను ఆదుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు గుర్తు చేశారు. రైతులకు టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో వర్షాలకు ధాన్యం మొలకలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, లేదంటే బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.


● చిన్నశంకరంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరి కోతలు మొదలై నెల రోజులు గడుస్తున్నా నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు మండిపడ్డారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తడిసిన వడ్లన్నీ కొనాల్సిందే

● అదనపు కలెక్టర్‌కు కిసాన్ మోర్చా వినతి

మెదక్ అర్బన్, నవంబరు2: అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన వడ్లన్నీ ప్రభుత్వమే కొనాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే వేలాది క్వింటాళ్ల వడ్లు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్క సెంటర్‌లో గింజ వడ్లు కూడా కొనుగోలు చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణనతోనే అన్ని వర్గాలకు సమన్యాయం: మెదక్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుల గణనతోనే అన్నీవర్గాలకు సమన్యాయం జరుగుతుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. శనివారం మెదక్‌లోని ద్వారకా గార్డెన్‌లో నిర్వహించిన సమగ్ర కులగణన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. బడుగు బలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేయనుందని, సమగ్రమైన కులగణన కాంగ్రెస్‌తోనే సాధ్యం అని అన్నారు. నియోజకవర్గంలో ఎన్నో గ్రామాల్లో సొంతగా బోర్లను వేయించామని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసి పెట్టిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, నాయకులు రాజేశ్, పవన్, సుప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేయనుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సమగ్ర కులగణన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటుందన్నారు. బీసీలు కులాల వారీగా విడిపోవద్దని సూచించారు.

ఖాకీ వనంలో గంజాయి మొక్కలు

(5వ పేజీ తరువాయి)

ఉండేవి. తాజాగా ఇది రుజువైంది. తీగ లాగితే డొంక కదిలినట్లు వ్యవహారంలో మరికొందరు ఖాకీల పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

పది నెలల్లో 507 కిలోల గంజాయి స్వాధీనం

సంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 25 ఎండు గంజాయి రవానా కేసులు నమోదయ్యాయి. రూ.10 కోట్లకు పైగా విలువైన 507 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకుని 60 మంది నిందితులను అరెస్టు చేశారు. నాలుగు చోట్ల గంజాయి సాగు చేస్తున్నట్టు గుర్తించి కేసులు కూడా నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. సాధారణంగా గ్రాములు, కిలోల కొద్ది గంజాయి పట్టుబడితేనే చర్చనీయాంశంగా మారుతుంది. కానీ జిల్లాలో క్వింటాళ్ల కొద్దీ గంజాయి పట్టుబడడం గమనార్హం.

విచ్చలవిడి వినియోగం.. అక్రమ రవాణా..

జిల్లాలో గంజాయి వినియోగం ఎక్కువైందనే ఆరోపణలున్నాయి. ఇందుకు పెద్దఎత్తున పట్టుబడిన గంజాయి నిల్వలే నిదర్శనం. హైదరాబాద్ శివార్లలోనో ఆర్సీపురం, కొల్లూరు, పటాన్‌చెరు ప్రాంతాలలోని నిర్మాణ సంస్థల్లో కూలీలుగా పనిచేసేవారికి చాక్లెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. దీనిపై పలు కేసులు నమోదైనప్పటికీ ఎలాంటి ప్రయోజనం ఉండట్లేదు. విక్రయాలు యథావిధిగానే సాగుతున్నాయి. ఇటీవల పాశమైలారం పారిశ్రామికవాడలో పోలీసులు గంజాయి చాక్లెట్లను పట్టుకున్నారు. తాజాగా చిరాగ్‌పల్లి, బీడీఎల్ భానూర్‌లోనూ గంజాయి రవాణా చేస్తున్న ముఠా పోలీసులకు పట్టుబడింది. హైదరాబాద్ నుంచి జిల్లా మీదుగా కర్నాటక, మహారాష్ట్రకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే అదనుగా గంజాయి రవాణా చేసేవాళ్లు సరుకును జిల్లా దాటిస్తున్నారు. ఇందులో కొన్ని పట్టుబడుతుండగా.. ఇంకొన్ని చిక్కకుండా పోతున్నాయి.

ఆరోగ్య కేంద్రాల్లో స్పెషాలిటీ వైద్యం...

(5వ పేజీ తరువాయి)

జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు సిఫారసు చేస్తారు.

అలవెన్స్ ఇస్తేనే..!

ఆరోగ్య కేంద్రాలకు స్పెషలిస్ట్ డాక్టర్లను పంపి ప్రజలకు నాణ్యమైన వైద్యమందించాలనే సర్కారు ఆలోచన ఆచరణలో ఇబ్బందులు తప్పేలా లేవు. తాము పనిచేస్తున్న ఆస్పత్రిని కాదని ఎక్కడో మారుమూల దవాఖానాలకు వెళ్లడమేమిటని పలువురు స్పెషలిస్ట్ డాక్టర్లు పెదవివిరుస్తున్నారు. రవాణా భత్యం, ఇతరత్ర సౌకర్యాలు కల్పిస్తేనే వెళ్తామని, లేకపోతే వెళ్లే ప్రసక్తి లేదని కూడా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు సూచించినట్టు సమాచారం. అందుకే యాదాద్రి-భువనగిరి జిల్లాలో పైలెట్‌గా స్పెషలిస్ట్ సేవలు ప్రారంభించిన సర్కారు.. అక్కడి పనిచేసే స్పెషలిస్ట్ డాక్టర్లకు ఏ మేరకు సౌకర్యాలు కల్పించాలనే దానిపై వైద్య శాఖ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నది. యాదాద్రిలో సక్సెస్ అయితే రాష్ట్ర వ్యాప్తంగా సేవలు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తుందని ఓ వైద్యాధికారి తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

నర్సాపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకుడు కడుపునొప్పి భరించలేక పురుగులమందు తాగడంతో ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం సాయంత్రం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి నక్క రఘుపతి(32) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చూపించినా తగ్గకపోవడంతో గత నెల 30న వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు పడిపోయాడు. ఇది గమనించిన కుటుంబీకులు సురారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఉరేసుకొని బిహార్ కూలీ బలవన్మరణం

టేక్మాల్/పాపన్నపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో కూలీ పనికి వచ్చిన బిహార్ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన ముఖేష్ పైల్వాన్(34) తనతో పాటు గ్రామానికి చేసిన కొంతమంది పాపన్నపేటకు చెందిన వ్యక్తి వద్ద పని నిమిత్తం గత నెల 30వ తేదీన వచ్చారు. అక్కడి నుంచి మండలంలోని డాక్యా తండాలో పని చేస్తున్నారు. శనివారం ఉదయం ముఖేష్ భార్య ఫోన్ చేయగా ఇద్దరూ గొడవ పడ్డారు. అనంతరం ముఖేష్ వెంకటాపూర్ గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణం చెందాడు ముఖేష్ బావ అనిల్‌పైల్వాన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడిన ముఖేష్ మృతదేహాన్ని బిహార్‌లోని సొంత గ్రామానికి తరలించేందుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి



మెగావత్ నాగార్జున(ఫైల్)

తూప్రాన్, నవంబరు (ఆంధ్రజ్యోతి)2: నెల రోజుల క్రితం జరిగిన గొడవలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మండలంలోని నర్సంపల్లిలో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సంపల్లి గ్రామానికి చెందిన మెగావత్ నాగార్జున(35), అదే గ్రామానికి చెందిన ధన్‌సింగ్ కుటుంబానికి వినాయక చవితి రోజున గొడవ జరిగింది. ఈ ఘటనలో నాగార్జున తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ క్రమంలో మళ్లీ అస్వస్థతకు గురైన నాగార్జున శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు తూప్రాన్ పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు

శివ్వంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లివస్తుండగా దారిలో అడ్డగించి దాడికి పాల్పడిన ఘటనలో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోమారం గ్రామంలో పల్లెపు యాదగిరి ఈనెల 1న ఓ ఫంక్షన్ హాల్‌లో శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కుంట లక్ష్మణ్, గడ్డం రాకేష్, కుంట నాగేష్, పాతింటి నవీన్, వాకిటి బిక్షపతి, వాకిటి హనుమంతు ఆరుగురు యాదగిరిని దారిలో అడ్డగించి దాడి చేశారు. అదే రాత్రి కుంట లక్ష్మణ్, కుంట దేవేందర్, పాత ఇంటి నవీన్, కుంట నగేష్ బాధితుల ఇంటికి వెళ్లి బూతు మాటలు తిట్టారని యాదగిరి సోదరుడు వీరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పలు మండలాల్లో పేకాట స్థావరాలపై దాడులు

నారాయణఖేడ్/కల్హేర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పండుగ సందర్భంగా నారాయణఖేడ్, కల్హేర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌పరిధిలో పేకాడుతున్న స్థావరాలపై తమ సిబ్బంది దాడి చేసి 49 మందిపై కేసులు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూదరుల నుండి రూ.94,920 నగదును, స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా కల్హేర్ మండల పరిధిలోని మార్డి, నాగ్‌ధర్ తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 42 మందిపై కేసులు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తెలిపారు. వారి నుంచి రూ.54,900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోర్గి చౌరస్తాలో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు

నాగల్‌గిద్ద, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోర్గి చౌరస్తాలో శనివారం నాగల్‌గిద్ద ఎస్ఐ సాయిలు పోలీస్ చెక్‌పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వరి ధాన్యం అక్రమరవాణాను అరికట్టడానికి అధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు.

ప్రభుత్వం సగరులను బీసీ(ఏ)లో కలపాలి



సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీక్రిష్ణ సగర

నారాయణఖేడ్, నవంబరు 2: ప్రభుత్వం అన్నిరకాలుగా వెనుకబడిన సగర(ఉప్పర)లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లో చేర్చాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి క్రిష్ణసగర అన్నారు. శనివారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన సగర సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సగరులు అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురయ్యారన్నారు. సగరులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర జనరల్‌సెక్రటరీ అంజయ్యసాగర్, జిల్లా నాయకులు అంజయ్య, నారాయణ, మల్లేశం, శ్రీనివాస్, సాయిలు, నర్సు.పండరి, బాల్‌రాజ్ ఉన్నారు.

బీజేపీ నాయకుడి మృతిపై విచారణ జరపాలి

నర్సాపూర్,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం బడంపేట గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు, భూతు అధ్యక్షుడు కొమురయ్య మృతిపై పలు అనుమానాలున్నందున పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్‌రావు డిమాండు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో ఉంచిన మృతదేహాన్ని శనివారం ఎంపీ రఘునందన్‌రావుతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళిధర్‌యాదవ్, కౌన్సిలర్లు సురేష్, బుచ్చేస్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రమణ, మాజీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అంజిగౌడ్ పరిశీలించి కుటుంబీకులను పరామర్శించారు.

'తారా'లో అవినీతి నిర్మూలనపై అవగాహన సదస్సు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాలను పురస్కరించుకొని కామర్స్ విభాగం, యూకో బ్యాంక్ సంయుక్తంగా అవినీతి నిర్మూలన అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూకో బ్యాంకు సీనియర్ మేనేజర్ శ్రీహరి మాట్లాడుతూ లోకాయుక్త, లోక్పాల్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వంటి యంత్రాంగాల విధులు వివరించారు.